బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి

- అహంకారంతోనే తప్పుడు వ్యాఖ్యలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనం

పలమనేరు: అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేసిన హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలని పలమనేరు నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆయన అధికార మదం, అహంకారంతోనే ఇలా వ్యవహరించాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీలో గతంలో ఎన్నడూ ఇలాంటి ఘటనలు జరగలేదని, సభకు సంబంధంలేని చిరంజీవిపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని మండిపడుతున్నారు.


పలమనేరులో రెండ్రోజుల క్రితం బాలక్రిష్ణ వ్యాఖ్యలపై సాగిన నిరసనలు

బాలకృష్ణ అభిమాని అయినందుకు బాధపడుతున్నా..



నేను బాలకృష్ణ అభిమానిగా ఎంతో డబ్బు పోగొట్టుకున్నా. ఆయన వ్యవహారశైలి చూసి ఇలాంటి వ్యక్తినా ఇన్నాళ్లు అభిమానించిందని బాధపడుతున్నాను. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రజాదరణ కలిగిన నేత. చిరంజీవి కష్టపడి పైకి వచ్చిన నటుడు. ఇలాంటి వారిపై అసెంబ్లీలో బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలు చాలా బాధపెట్టాయి. ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలి.

–దీకే జగదీష్, పూర్వ బాలక్రిష్ణ అభిమాన సంఘ నాయకుడు, పలమనేరు

మానసిక స్థితి సరిగా లేదు



అసెంబ్లీలో హుందాగా ప్రవర్తించాల్సిన ఒక ఎమ్మెల్యే ఇంత అనుచితంగా మాట్లాడడం ఎన్నడూలేదు. వాడు, వీడు అంటూ చిరంజీవిపై వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. సీఎం సభలో ఉన్నా బాలకృష్ణను వారించకపోవడం దారుణం. స్పీకర్ అయినా అభ్యంతరం చెప్పి ఉండాల్సింది. మెంటల్ సర్టిఫికెట్ తీసుకున్న బాలకృష్ణకు గత ఎన్నికల్లో అసలు టికెట్ ఇవ్వడమే పెద్ద తప్పు.

– ఆర్ చెంగారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, పలమనేరు

నీతిలేని బాలకృష్ణను జనం విశ్వసించరు



2004లో తన ఇంట్లో గన్ తీసుకొని ఇద్దరిపై కాల్పులకు తెగబడిన బాలకృష్ణను కాపాడింది నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కాదా. ఆయన సినిమాలకు టికెట్ ధరలు పెంచాలని బాలకృష్ణ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని అడుక్కోలేదా. ఈ విషయాన్ని నాటి మంత్రి పేర్నినాని సెటిల్ చేయలేదా. కనీస విశ్వాసం లేని ఇలాంటి వారిని జనం విశ్వసించరు.

–మొగసాల క్రిష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకుడు, బైరెడ్డిపల్లి

కాపులంటే బాలకృష్ణకు చిన్నచూపు



బాలకృష్ణ తరచూ చిరంజీవిని అవమానించడాన్ని గమనిస్తున్నాం. కాపు సామాజికవర్గం అంటే బాలకృష్ణకు చిన్నచూపు. ఆ వర్గాన్ని తక్కువ చేసి మాట్లాడడం అలవాటుగా మారింది. మానసిక సమస్యతో బాధపడుతున్న ఇలాంటి వ్యక్తికి చంద్రబాబు టికెట్ ఇవ్వడమే తప్పు. ఇలాంటి వ్యక్తిని శాసనసభకు ఎందుకు పంపామా అని హిందూపురం వాసులు బాధపడుతున్నారు.

–సోమచంద్రారెడ్డి, జిల్లా మేధావుల సంఘం ప్రెసిడెంట్

ఉచిత ఆయుర్వేద శిబిరానికి విశేష స్పందన


శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం సుప్రబాత్ సుఖాయు ఆయుర్వేద ఆస్పత్రి వైద్యులు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు శిబిరాన్ని పరిశీలించారు. డాక్టర్ శివసాహితి మాట్లాడుతూ 170 మందికి బీపీ, షుగర్, కీళ్లు, రూ.2,600 విలువైన ఎనుకల సాంద్రత పరీక్షలు చేసినట్టు తెలిపారు.

నేడు సినారె సాహితీ వైభవం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లిలోని బ్రెయిన్ బాక్స్ అకాడమీ భవనంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఆచార్య సి.నారాయణరెడ్డిపై సినారె సాహితీ వైభవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భారతీయ తెలుగు రచయితల సమాఖ్య సభ్యుడు డి.దేవేంద్ర తెలిపారు. ఇందులో సినారె గీతాలాపన, కవితార్చన ఉంటుందన్నారు. అనంతరం 30 మంది రచయితలు, గాయకులకు సినారె జాతీయ పురస్కారాలు –2025 ప్రదానం చేస్తున్నట్లు వెల్లడించారు.

తాగునీరు ఇవ్వాలని ధర్నా


గూడూరుపల్లె వద్ద ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

పుంగనూరు: తాగునీటి సమస్యతో అల్లాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గూడూరుపల్లె వద్ద జగనన్న కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు ఆదివారం తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ జాతీయ రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నాకు దిగారు. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న సీఐ సుబ్బరాయుడు అక్కడికి చేరుకుని మహిళలతో చర్చించారు. అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ధర్నాను విరమించారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ


దుర్గాదేవి, సరస్వతిదేవి వేషధారణలో చిన్నారులు లేఖనప్రియ, కీర్తిక

చౌడేపల్లె: కలికిరికి చెందిన శ్రీవారాహి నృత్యాలయానికి చెందిన కళాకారులు లేఖనప్రియ, కీర్తిక దుర్గాదేవి, సరస్వతీ దేవి వేషధారణలో అలరించారు. వారు ఆదివారం బోయకొండ గంగమ్మ ఆలయంలో నృత్యం చేశారు. వారిని ఈవో ఏకాంబరం అభినందించి ప్రసాదాలు అందజేశారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం


సదుంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

సదుం: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. సోమల మండలం కొల్లావారిపల్లెకు చెందిన మల్లికార్జున నాయుడు కుటుంబంపై ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దాడి చేశారు. బాధితులు సదుం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని ఆయన పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ కొల్లావారిపల్లెలో ఉన్న వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై తరచూ దాడులు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఫిర్యాదు చేయడానికి వెళ్తే దుర్భాషలాడుతున్నారని చెప్పారు. పోలీసులు పక్షపాతం వహించడం సరికాదని చెప్పారు. కూటమి నేతలు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తే, తమ పార్టీ వారి కోసం డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తున్నామన్నారు. దాడులకు పాల్పడుతున్న వారిని వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పుత్రాజు, రమేష్‌రెడ్డి, వెంకటరమణ, ఇంద్రసేనా రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులను ప్రేమగా చూసుకోవాలి


వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న చర్చి ప్రతినిధులు

పుంగనూరు: ప్రతి కుటుంబంలోనూ వృద్ధులను నిర్లక్ష్యంగా కాకుండా ప్రేమగా చూసుకోవాలని సీఎస్ఐ చర్చి పాస్టర్ రాఖేష్ పిలుపునిచ్చారు. చర్చిలో ఆదివారం సీనియర్ సిటిజన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులను సన్మానించారు. అయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేకపోతే మనం లేము అనే విషయాన్ని గ్రహించాలన్నారు. వారి ఆర్థిక అవసరాలను గుర్తించి సేవ చేసి రుణం తీర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రవికుమార్, సురేష్‌కృష్ణప్ప, భరత్ భూషణ్, కృపాకర్, సుధాకర్, సత్యరాజ్, సుందర్‌సింగ్ విక్టర్, వరకుమార్, సుమిత్ర, భారతి, హేమలత, భాస్కర్, చౌహత్ జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇంటింటా ప్రచారం


భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

పెద్దపంజాణి: త్రైత సిద్ధాంత భగవద్గీత విశిష్టతను ఇంటింటా ప్రచారం చేసి భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక కుప్పం కమిటీ అధ్యక్షుడు కృష్ణ తెలిపారు. ఆయన ఆదివారం అప్పినపల్లి, కుంబార్లపల్లి, చామనేరు, బొమ్మరాజుపల్లి, వలసపల్లి, ముదరంపల్లిలో ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రకాష్, పార్థసారథి, ఇందిర, సంగీత, రాధ తదితరులు పాల్గొన్నారు.

జాషువా సాహిత్యాన్ని నేటి తరానికి పరిచయం చేయాలి


గుర్రం జాషువాకు నివాళులర్పిస్తున్న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి సభ్యులు

పలమనేరు: జాషువా సాహిత్యాన్ని నేటి తరానికి పరిచయం చేయాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథంనాయుడు తెలిపారు. స్థానిక కళామందిరంలో ఆదివారం గుర్రం జాషువా జయంతిని జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తులసీనాథంనాయుడు మాట్లాడుతూ తెలుగు సాహిత్యం కోసం గుర్రం జాషువా చేసిన కృషిని నేటి తరం గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన మార్గంలో నేటి రచయితలు పయనించాలని సూచించారు. ఎంఈవో శ్రీనివాసులు, పుష్ప, దామోదరనాయుడు, జమున, కుమారి, భార్గవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెకానిక్‌కు ఆర్థిక సాయం


మెకానిక్‌కు నగదు అందజేస్తున్న నాయకులు

పుంగనూరు: పట్టణానికి చెందిన మెకానిక్ ఇలియాజ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతనికి చికిత్సల కోసం మెకానిక్కుల సంఘం అధ్యక్షుడు బండకుమార్, గౌరవ అధ్యక్షుడు అర్షదుల్లాఖాన్, నాయకులు అజ్మతుల్ల, సుధాకర్, రాజా, లావణ్యకుమార్, అబ్దుల్, రఘు రూ.15 వేలు సేకరించి అందజేశారు. అండగా వుంటామని ధైర్యం చెప్పారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం


ఈవోకు నగదు అందజేస్తున్న రంజిత్‌కుమార్ దంపతులు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి కర్ణాటక రాష్ట్రం హొసకోటకు చెందిన రంజిత్‌కుమార్ దంపతులు రూ.1,00,101 విరాళం ఇచ్చారు. వారు ఆదివారం ఈవో ఏకాంబరంనకు నగదు అందజేశారు. వారికి ఆయన అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలతో సత్కరించారు.

130 మందికి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

శాంతిపురం: మండలంలోని తుమ్మిశి రోడ్డులో వున్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 130 మందికి కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా చేపట్టిన సేవా పక్షోత్సవాల్లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించినట్టు బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గజేంద్ర, కె.పార్థసారథి తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు, విజయ్, మంజునాథ్, నాగేష్, కుమార్, వీరరాఘవరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీహార్ వాలా గో బ్యాక్


నిరసన తెలుపుతున్న భజంత్రీలు

బైరెడ్డిపల్లె: మండల కేంద్రమైన బైరెడ్డిపల్లెలో ఆదివారం భజంత్రీలు బీహార్ వాలా గో బ్యాక్ అని నినదించారు. వారు మాట్లాడుతూ బైరెడ్డిపల్లెలో సుమారు 30 కుటుంబాలకు పైగా హేర్‌సెలూన్ దుకాణాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. బీహార్‌కు చెందిన ఒక వ్యక్తి బైరెడ్డిపల్లె చెక్‌పోస్టు కూడలి సమీపంలో భారీస్థాయిలో దుకాణం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ విషయంపై బైరెడ్డిపల్లె పోలీసులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. బీహార్ వాళ్లు నడుతున్న దుకాణంపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

పలమనేరు ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం


రాజన్నను అభినందిస్తున్న నేతలు

పలమనేరు: పలమనేరు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన రాజన్నను ఆదివారం వాల్మీకి సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. సంఘం రాష్ట్ర నాయకుడు ఎల్ భాస్కర్ స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడిగా నాగరాజ


ఎన్నికైన ఫొటోగ్రాఫర్ల సంఘం నేతలు

పుంగనూరు: పట్టణంలోని ఫొటోగ్రాఫర్ల సంఘం ఎన్నికలను ఆదివారం ఏకగ్రీవంగా చేపట్టారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా చంద్రలక్ష్మీపతి, అధ్యక్షుడిగా నాగరాజ, ఉపాధ్యక్షుడిగా బండిబాలు, కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా బోసును ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడు నాగరాజ మాట్లాడుతూ ప్రభుత్వం ఫొటోగ్రాఫర్లకు బ్యాంకు రుణాలు ఇప్పించాలని కోరారు. ఇళ్లు, పెన్షన్లు మంజూరు చేయాలని, ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో శేఖర్, మురళి, రాజేష్, రాజు, ముని, కరుణాకర్, శంకర్, మణి తదితరులు పాల్గొన్నారు.

మహాచండీ నమోస్తుతే..

పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం అమ్మవార్లను పలుచోట్ల మహాచండీగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కొన్నిప్రాంతాల్లో శ్రీలలితా త్రిపుర సుందరిగా అలంకరించారు. ఉభయదారుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కొన్నిచోట్ల అన్నదానం చేశారు.

పుంగనూరు: పట్టణంలోని భోగనంజుడేశ్వర స్వామి ఆలయంలో పార్వతిదేవిని మహాచండిదేవిగా, బస్టాండ్‌లోవున్న విరూపాక్షి మారెమ్మను కరెన్సీ నోట్లతో అలంకరించారు. వాసవి కన్యకా పరమేశ్వరి, చదళ్లలో చౌడేశ్వరిదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

శ్రీమహాచండిగా కాళికా దేవి

పెద్దపంజాణి: మండలంలోని శివాడి గ్రామంలో వెలసిన కాళికాదేవి ఆదివారం శ్రీమహాచండిగా అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పలమనేరు పట్టణానికి చెందిన మీనాక్షి, శివకుమార్ కుటుంబ సభ్యులు, సాయంత్రం కేజీఎఫ్ పట్టణ వాసులు శోభమ్మ, రామాచారి, నెల్లిపట్ల మంజుల, నాగరాజాచారి ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

లలితా త్రిపుర సుందరిగా మలాలమ్మ

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద వున్న మలాలమ్మ (చాముండేశ్వరి దేవి) ఆదివారం శ్రీలలితా త్రిపురసుందరి అవతారంలో భక్తులను అనుగ్రహించారు. ఆలయ ధర్మకర్త చంద్రప్ప ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ధనలక్ష్మిగా వాసవీమాత

పులిచెర్ల(కల్లూరు): కల్లూరులో వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఆదివారం ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా ఇమ్మిడిశెట్టి సాయినాథ్‌శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.



పులిచెర్ల: కల్లూరులో ధనలక్ష్మిగా కన్యకా పరమేశ్వరి, పుంగనూరు: మహాచండిగా పార్వతిదేవి

మహాచండి అలంకరణలో ముత్యాలమ్మ

రొంపిచెర్ల: రొంపిచెర్లలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారు ఆదివారం మహాచండిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉభయదారులుగా మేల్నాటి రాధాకృష్ణయ్య, లలిత దంపతులు వ్యవహరించారు. అలాగే కన్యకా పరమేశ్వరి అమ్మవారు లలితాదేవి అలంకరణలో కొలువుతీరారు. ఉభయదారులుగా పుట్టా బాలాజీ వ్యవహరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మహాచండిగా దర్శనమిచ్చిన అమ్మవార్లు

బైరెడ్డిపల్లె: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి, సల్లాపురెమ్మ అమ్మవార్లు ఆదివారం మహాచండీదేవిగా, బాటగంగమ్మ మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

విజయలక్ష్మీదేవిగా అమ్మవార్లు

వి.కోట: పట్టణంలో వెలసిన దుర్గామాత, వాసవి మాత ఆదివారం విజయలక్ష్మీదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.




బైరెడ్డిపల్లె: మహాచండీగా సల్లాపురెమ్మ, మహాలక్ష్మి అలంకరణలో బాటగంగమ్మ, పెద్దపంజాణి: మహాచండిగా కాళికాదేవి





రొంపిచెర్ల: మహాచండిగా ముత్యాలమ్మ, వి.కోట: విజయలక్ష్మీ దేవిగా వాసవీ మాత, గంగవరం: లలితా త్రిపురసుందరిగా మలాలమ్మ, పుంగనూరు: కరెన్సీతో విరూపాక్షి మారెమ్మ అలంకరణ